వైఎస్ఆర్-అన్నమయ్య
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## ఈనెల 30న కలికిరికి మాజీ సీఎం కిరణ్ రాక



కలికిరి, మార్చి 27, ప్రభాతవార్త: రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి ఈనెల 30న కలికిరికి విచ్చేస్తున్నట్లు మాజీ సీఎం పీఏ కృష్ణప్ప తెలిపారు. బీజేపీ అధిష్టానం రాజంపేట పార్లమెంట్ ఎంపీ అభ్యర్థిగా మాజీ సీఎం నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డిని ఎంపిక చేసింది. టీడీపీ, బీజేపీ, జనసేన ఉమ్మడి రాజంపేట పార్లమెంటు ఎంపీ అభ్యర్థిగా కిరణ్‌కుమార్‌రెడ్డిని ఎంపిక చేయడం జరిగింది. శనివారం ఉదయం 8 గంటలకు బెంగళూరులో బయలుదేరి 11 గంటలకు మదనపల్లెకు చేరుకుంటారన్నారు. అక్కడ జరిగే రోడ్డు షోలో మాజీ సీఎం పాల్గొంటారని పేర్కొన్నారు. అనంతరం అక్కడి నుంచి బయలుదేరి కలికిరి రెసిడెన్సీకి చేరుకుంటారని కృష్ణప్ప తెలిపారు. ఈ పర్యటనను నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని ఆయన కోరారు.






# రాలయసీమ ద్రోహి ముఖ్యమంత్రి జగన్

**-అధికారంలోకి రాగానే మదనపల్లె జిల్లా కేంద్రం**
**-మదనపల్లె ప్రజాగళం సభలో చంద్రబాబునాయుడు**





మదనపల్లె, మార్చి 27 ప్రభాతవార్త: రాయలసీమ ప్రాంతానికి తాగు, సాగునీరు ఇవ్వడంలో ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి పూర్తిగా విఫలమై రాయలసీమ ద్రోహిగా మిగిలారని టిడిపి జాతీయ నాయకులు మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుఅన్నారుబుధవారం సాయంత్రం అన్నమయ్యజిల్లా మదనపల్లెలోని బెంగుళూరు బస్టాండులో జరిగిన ప్రజాగళం బహిరంగసభలో చంద్రబాబునాయుడు మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ గెలిపొంది అధికారంలోకి రాగానే ఎంతో చరిత్ర కలిగిన మదనపల్లెను జిల్లా కేంద్రంగా ప్రకటిస్తామని నియోజకవర్గ ప్రజలకు ఆయన హామీ ఇచ్చారు. బ్రిటీష్‌కాలంలోనే మదనపల్లెను గుర్తించారని ఇక్కడ సబ్‌కలెక్టర్ కార్యాలయంతో పాటు అన్ని ప్రభుత్వ కార్యాలయాలు పెద్ద భవంతుల్లో ఉన్నాయన్నారు. చరిత్ర కలిగిన మదనపల్లెను వైకాపా నాయకులు దోపిడి చేశారేకాని అభివృద్ధి చేయడంలో పూర్తిగా విఫలం చెందారన్నారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, తనయుడు ఎంపి మిథున్‌రెడ్డి మైనింగ్, ఇసుక, మద్యం దోపిడి, భూకబ్జాలతో ప్రజాధనాన్ని దోచుకొన్నారన్నారు. టిడిపి అధికారంలోకి రాగానే మదనపల్లె, తంబళ్లపల్లెలో కబ్జాకు గురైన ఆస్థులన్నీ కాపాడుతామన్నారు. ఎన్‌టిరామారావు ప్రారంభించిన నీటి ప్రాజెక్టులు అన్నీ తుంగలో ముఖ్యమంత్రి తొక్కారన్నారు. టిడిపి అధికారంలోకి రాగానే పెండింగ్ ప్రాజెక్టులు అన్నీ పూర్తి చేసి రాయలసీమ ప్రజలకు తాగు, సాగునీరు అందిస్తామన్నారు. మైనార్టీ సంక్షేమానికి పెద్దపీట వేస్తామన్నారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసిలకు సముచిత స్థానం కల్పిస్తామన్నారు. నిత్యవసర ధరలు నియంత్రణ చేసి ప్రజలకు అందుబాటులో ఉండేలా చూస్తానన్నారు. మద్యం ధరలు కూడా నియంత్రిస్తానన్నారు. రాష్ట్ర ప్రజల బాగోగుల కోసమేబిజెపి,జనసేనలతోటిడిపి పొత్తుపెట్టుకోవడం జరిగిందన్నారు. ఐదేళ్ళు అరాచకాలకు పాల్పడిన వైకాపాకు బుద్ధిచెప్పి టిడిపిని ఆదరించి మళ్ళీ అధికారంలోకి వచ్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. 47రోజుల్లో అరాచక పాలనకు చమరగీతం పాడాలన్నారు. టిడిపి అధికారంలోకి వస్తేనే పరిశ్రమలు మెండుగా వస్తాయన్నారు. నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలతో పాటు ఉద్యోగ అవకాశాలుకల్పిస్తామన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు పెండింగ్‌లోనిబకాయిలనుచెల్లిస్తామన్నారు. డ్రగ్స్ మాఫియాగా ఉన్న రాష్ట్రాన్ని స్వర్ణాంధ్ర రాష్ట్రంగా తీర్చిదిద్దుతామన్నారు. మైనార్టీల సంక్షేమానికి గతంలో కూడా టిడిపి పెద్దపీట వేసిందన్నారు. మదనపల్లె నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి షాజహాన్‌బాషాను అత్యధిక మెజార్టీతో గెలిపించి అసెంబ్లీకి పంపాలన్నారు. పాపాల పెద్దిరెడ్డికి దగ్గరలోనే పాపం పండుతుందన్నారు. అన్నమయ్య జిల్లాలో వీరి ఆగడాలను కట్టడి చేసేందుకు ప్రతి కార్యకర్త ఎన్నికల్లో కష్టపడి టిడిపి అధికారంలోకి వచ్చేందుకు కృషి చేయాలన్నారు. మదనపల్లెను విద్యాహబ్‌గా తీర్చిదిద్దుతానన్నారు. అంతేకాకుండానియోజకవర్గంలోపెద్దఎత్తున అభివృద్ధి పనులకు చర్యలు తీసుకొంటానన్నారు. ఈకార్యక్రమంలో ఎమ్మెల్యే అభ్యర్థి షాజహాన్‌బాషా తో పాటు తంబళ్ళపల్లె అభ్యర్థి దాసిరిపల్లె జయచంద్రారెడ్డి,పీలేరు అభ్యర్థి కిషోర్‌కుమార్‌రెడ్డి, జిల్లా అధ్యక్షులు చమర్తి రామ్మోహన్‌రాజు, పుంగనూరు అభ్యర్థి చల్లాబాబు రామచంద్రారెడ్డి, రాయచోటి అభ్యర్థి రామప్రసాద్‌రెడ్డి, నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు. ప్రజాగళం సభ విజయవంతం కావడంతో చంద్రబాబునాయుడు ఎమ్మెల్యే అభ్యర్థి షాజహాన్‌బాషాను అభినందించారు.

# పేదలకు తోడుగా రాష్ట్రంలో నూరు శాతం సంక్షేమం అందించిన వైసిపి

**చంద్రబాబుకు ఓటు వేస్తే సంక్షేమ పథకాల రద్దును ఆమోదించినట్లే సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి**



ప్రొద్దుటూరు, మార్చి 27, ప్రభాతవార్త: రాష్ట్రంలో పేదలకు తోడుగా నూరు శాతం సంక్షేమం అందించిన ఘనత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వానిదే అని సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అన్నారు. బుధవారం ఇడుపుల పాయనుండి ప్రారంభించిన బస్సు యాత్రలో భాగంగా ప్రొద్దుటూరుకు చేరుకున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అక్కడ ఏర్పాటుచేసిన బహిరంగ సభలో ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మొట్టమొదటిసభ ప్రొద్దుటూరు గడ్డపై వైసీపీ మద్దతు తెలుపుతూ వచ్చిన వారితో మహాసముద్రంలా కనబడుతుందన్నారు. వైఎస్సార్ జిల్లా చరిత్రలో చిరస్థాయిగా ఈ సభ నిలిచిపోతుందని తెలిపారు. ప్రజా సైన్యం మధ్యన ప్రజాజైత్ర యాత్రకుముందు వరుసలో వైసీపీ జెండా తల ఎత్తుకొని ఎరుగుతుందని అన్నారు. పేదల భవిష్యత్తు, రైతులు, అక్కాచెల్లెమ్మలు, గ్రామాల కోసం ఇంటింటా అభివృద్ధి, సంక్షేమం కోసం ఒక బాధ్యతగా ప్రతిరంగంలోనూ మహిళలకునేరుగా 2లక్షల 70వేల కోట్లు నగదును మహిళలకు జమచేశామన్నారు. లంచాలకు తావులేకుండా కులమతాలకు అతీతంగా పారదర్శకంగా ప్రతి కుటుంబానికి మేలు చేశామన్నారు. ప్రజా ప్రభుత్వ ఎజెండాయే మన జెండాఉద్దేశం అన్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా మన పార్టీకి, ప్రభుత్వానికి మద్దతు తెలుపుతూ ఎన్నికల సమరానికి సిద్ధం అయ్యామన్నారు. మే 13న జరగబోవు ఎన్నికల కోసం అభివృద్ధి నిరోధకులు, పేదల వ్యతిరేకులకుఓడించడానికి గెలుపే లక్ష్యంగా మనమంతా అడుగులు వేయాలన్నారు. ప్రజలను మోసం చేసే పార్టీలు, కుట్రలు పన్నే నాయకులు మనకు పోటీలో ఉన్నారన్నారు. ప్రజలను నమ్మించి మోసం చేయడంలో చంద్రబాబుకు 45ఏళ్ల అనుభవం ఉందన్నారు. ఎన్నికలలో ప్రకటించిన మేనిఫెస్టో ఎన్నికల అనంతరం తీసే ఘనత చంద్రబాబుకే ఉందన్నారు. 14సంవత్సరాలుగా ప్రజలను మోసం చేస్తూనే ఉన్నారని చంద్రబాబుపై విరుచుకుపడ్డారు. అంతేకాకుండాఅణగారిన రాజకీయాలు చేస్తూ కుటుంబాలను చీల్చడంలో చంద్రబాబుకు అనుభవం ఉందన్నారు. బాబాయ్ వివేకాను ఎవరు చంపారో, ఎవరు చంపించారో దేవుడికి, జిల్లా ప్రజలకు తెలుసు అన్నారు. తిరిగి వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీపైబురదజల్లేప్రయత్నం చేస్తున్నారన్నారు. బాబాయ్ వివేకాను హత్య చేసిన వారికి ఎవరు మద్దతు ఇస్తున్నారో కూడ ప్రజలకు తెలుసన్నారు. నేరుగా హత్య చేసిన వారిని చంద్రబాబు, ఎల్లో మీడియాలు కలిసి నిస్సిగ్గుగాఅంతా కలిసి మద్దతు ఇస్తున్నారని తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికలలో ఓడించిన వారిలో చెల్లెమ్మలు తిరుగుతున్నారంటే అర్థం చేసుకోవాలన్నారు. ఇంతకన్నా అన్యాయం ఎక్కడైనా ఉందా అని ప్రశ్నించారు. ప్రజల మద్దతు చంద్రబాబుకులేదని నీ బిడ్డ జగన్ దేవుడిని, ప్రజలను నమ్ముకున్నానని తెలిపారు. వైసీపీ ప్రకటించిన మేనిఫెస్టోను ఒక భగవద్గీతగా, ఒక ఖురాన్‌గా, ఒక బైబిల్‌గా చూస్తామని మేనిఫెస్టోలోని అంశాలు 98శాతం అమలు చేశామని తెలిపారు.ఇటివల వైజాగ్‌లో ఫ్రెండ్స్ కంటైనర్స్ సీబీఐ దాడిలో పట్టుబడితే చంద్రబాబు వదినమ్మ రాష్ట్ర బీజేపి అధ్యక్షురాలు పురంధరేశ్వరికి బంధువులు అన్నారు. కానీ దొరకని వారు వారి బ్రదర్స్ అయితే దొరికిన వారు మన బ్రదర్స్

అని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఎక్కడ ఏమి జరిగిన అవి మనపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారన్నారు. నైతిక విలువలు లేని రాజకీయాలు చేస్తుంది చంద్రబాబు అన్నారు. ఇలాంటి రాజకీయాలు చూస్తుంటేఛీ అనిపించడం లేదా అని ప్రశ్నించారు. కేంద్రం నుండి పరోక్షంగా ఒక పార్టీని ప్రత్యక్షంగా ఒక పార్టీతో చంద్రబాబు జతకట్టారన్నారు. గత ఎన్నికల్లో తిట్టిన పార్టీలతో జతకట్టడం చంద్రబాబుకే చెల్లిందన్నారు. విశ్వసనీయత,విలువలు లేని రాజకీయాలు ఎవరికి స్ఫూర్తి దాయకం అన్నారు. 58నెలల్లో ఎన్నడూ లేని విధంగా మేనిఫెస్టోలోని 98శాతం పథకాలను అమలుచేసిన ఘణత వైసీపీదే అన్నారు. రాష్ట్రంలో ప్రతి గ్రామం, వార్డులలో సచివాలయంఏర్పాటుచేసి

4లో

# ఎట్టకేలకు జమ్మలమడుగు, బద్వేల్ బిజెపి అభ్యర్థుల ఖరారు





కడప మార్చి 27, (ప్రభాతవార్త బ్యూరో) ఎట్టకేలకు భారతీయ జనతా పార్టీ కడప పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని జమ్మలమడుగు ,బద్వేలు అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులను అధికారికంగా ప్రకటించింది. ఊహించినట్లుగానే జమ్మలమడుగు అభ్యర్థిగా రాష్ట్ర నేత దేవగుడి ఆదినారాయణ రెడ్డి , బద్వేలు అభ్యర్థిగా బొజ్జ రోశన్న ఖరారు అయ్యారు. ఫలితంగా కడప పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో అన్ని అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థుల ఖరారు పూర్తయింది. అటు వైసిపి, ఇటు బిజెపి- కూటమి అభ్యర్థుల ఎంపిక పూర్తయిన నేపథ్యంలో ప్రచారం హెూరెత్తనుంది. జిల్లాలో జిల్లాలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి మేమంతా సిద్ధం కార్యక్రమంలో భాగంగా పొద్దుటూరులో సభకు శ్రీకారం చుట్టిన నేపథ్యంలో త్వరలోనే జిల్లాలో టిడిపి చంద్రబాబు నాయుడు సభ కూడా ఏర్పాటు చేసేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు.

# మదనపల్లెలో సత్తా చాటుకొన్న షాజహాన్‌బాషా

**సభ విజయవంతంతో టిడిపిలో నూతన ఉత్తేజం**



మదనపల్లె, మార్చి 27 ప్రభాతవార్త : పట్టణంలోని బెంగుళూరు బస్టాండులో బుధవారం సాయంత్రం మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేపట్టిన ప్రజాగళం బహిరంగసభ విజయవంతం కావడంతో నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి షాజహాన్‌బాషా తన సత్తాను చాటుకొన్నారు. నియోజకవర్గ నలుమూలల నుంచి పెద్దఎత్తున ప్రజలను ప్రజాగళం బహిరంగసభకు తరలించి సభను విజయవంతం చేశారు. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన తరువాత నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడు మదనపల్లెలో తొలిసారిగా నిర్వహించిన ప్రజాగళం బహిరంగసభ ఊహించని విధంగా విజయంతం కావడంతో ఇటు నాయకుల్లోనూ, అటు కార్యకర్తల్లోనూ, ముస్లిం మైనార్టీల్లోనూ నూతన ఉత్తేజం నెలకొంది. చంద్రబాబు ప్రసంగంలో కార్యకర్తలు ఈలలు వేసి తప్పట్లు కొట్టడంతో సభాప్రాంగణం కార్యకర్తలతో దద్దరిల్లింది. ఏది ఏమైనా ప్రజాగళం బహిరంగసభ విజయవంతం కావడంతో ఎమ్మెల్యే అభ్యర్థి సత్తా నిరూపించుకొన్నారు. గత పదిరోజులుగా షాజహాన్‌బాషా చేపడుతున్న ఎన్నికల ప్రచారంలో జోష్ నెలకొనడంతో ఉమ్మడి అభ్యర్థి గెలుపొందడం ఖాయమని నియోజకవర్గంలో ప్రజలు చర్చించుకోవడనం జరుగుతోంది. జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు కూడా ఆయనకు సంఘీభావం తెలపడం జరుగుతోంది. ఎన్నికల ప్రచారంలో కూడా షాజహాన్‌బాషా వినూత్నస్థాయిలో ప్రచారం నిర్వహిస్తుండడంతో ప్రజలు ఆకర్షితులు అవుతున్నారు. ప్రజాగళం బహిరంగసభకు నియోజకవర్గంలోని రామసముద్రం, నిమ్మనపల్లె, రూరల్ మండలం, పట్టణంలోని 35వార్డులకు చెందిన ప్రజల పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేశారు.

# ఎన్నికల కోడ్ ఉల్లంఘనలపై కొరడా !!

**- జిల్లా ఇంటిగ్రేటెడ్ కమాండ్ సెంటర్ ద్వారా ప్రత్యేక పర్యవేక్షణ**
**- 583 ఫిర్యాదులకు 564 పరిష్కారం**
**- రూ. 61.10 లక్షల విలువైన నగదు, లిక్కర్ ఇతర వస్తువులు సీజ్**



రాయచోటి, మార్చి 27, ప్రభాత వార్త : జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనపై మొత్తం 583 ఫిర్యాదులు అందగా అందులో 564 ఫిర్యాదులకు పరిష్కారం అందించామని, 19 ప్రోగ్రెస్‌లో ఉన్నాయని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టరర్ అభిషిక్త్ కిషోర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన వెంటనే రాయచోటి కలెక్టరేట్ నందు జిల్లా ఇంటిగ్రేటెడ్ కమాండ్ సెంటర్‌ను ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కేంద్రం ద్వారా ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలపై ప్రత్యేక దృష్టి సారించి వేరువేరు ఫిర్యాదుల ద్వారా అందిన ఫిర్యాదులపై జిల్లా ఎన్నికల అధికారి ఆధ్వర్యంలో ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవడం జరుగుతుంది. ఫిర్యాదుల వివరాలు సి విజిల్ ద్వారా 74 ఫిర్యాదులు అందగా 74 పరిష్కారం, ప్రింట్ మీడియా ద్వారా 53 ఫిర్యాదులు రాగా 52 పరిష్కారం, కంప్లైంట్ మానిటరింగ్ యాప్/సిఇఒ ద్వారా 16 ఫిర్యాదులు అందగా 9 పరిష్కారం, 7 ప్రగతిలో ఉన్నాయి. డిస్ట్రిక్ కాల్ సెంటర్ ద్వారా 7 ఫిర్యాదులు అందగా 7 పరిష్కారం. ఎన్‌జిపిఎస్ (1950) ద్వారా 72 ఫిర్యాదులు అందగా 72 పరిష్కారం, ఎన్‌జిఎస్‌పి (సిటిజన్) యాప్ ద్వారా 337 ఫిర్యాదులు అందగా 328 పరిష్కారం, 9 ప్రగతిలో ఉన్నాయి. ఆఫ్‌లైన్ ద్వారా 25 ఫిర్యాదులు అందగా 22 పరిష్కారం, 3 ప్రగతిలో ఉన్నాయి. ఎఫ్‌ఎస్‌టి, ఎస్‌ఎస్‌టి, పోలీసు ఎన్‌ఫోర్స్‌మెంట్ టీం ద్వారా చేపట్టిన సీజర్ మేనేజ్‌మెంట్ ప్రక్రియ ద్వారా కోడ్ అమలులోకి వచ్చినప్పటి నుండి ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా మొత్తంగా రూ. 61.10 లక్షల విలువైన నగదు, వస్తువులను సీజ్ చేయడం జరిగిందన్నారు. ఇందులో రూ. 26.81 లక్షల మేర నగదు, రూ. 14.89 లక్షల విలువైన లిక్కర్ రూ. 1.40 లక్షల విలువైన గంజాయి, రూ. 17.90 లక్షల విలువైన బంగారు, వెండి, ఇతర వస్తువులను సీజ్ చేయడం జరిగింది. అలాగే ఎంసిసి అతిక్రమణ కింద 7 ఎఫ్ఐఆర్ కేసులు నమోదు చేయడం జరిగింది.

**రాజంపేటలో పట్టపగలే తలుపులు బద్దలు కొట్టి....**



**10లక్షలు పైగా బంగారు, నగదు దోపిడీ!!**

## పుట్టా సమక్షంలో టిడిపిలో చేరికలు,



మైదుకూరు మార్చి 27,ప్రభాతవార్త :
మైదుకూరు మునిసిపాలిటీ 4వ వార్డు గడ్డంవారిపల్లెగ్రామానికి చెందిన దండు రామకృష్ణ,మాజీ సర్పంచు దండు వెంకట లక్షుమ్మ,వై.వెంకటేష్ తదితర వారి అనుచరులు దాదాపు 10కుటుంబాలు నియోజకవర్గ యన్‌డిఏ తెలుగుదేశం పార్టీ అభ్యర్థి పుట్టా సుధాకర్ యాదవ్ సమక్షంలో టిడిపిలో చేరారు.ఈ సంధర్బంగా పుట్టా సుధాకర్ యాదవ్ మాట్లాడుతూ నాకు మద్దతూ తెలిపి,నాగెలుపుకు కొసం కృషి చేస్తామని చెప్పడం చాలా సంతోషంగా ఉందన్నారు,అలాగే నాగెలుపుకు సహకరించిన వారందరిని నేను ఎప్పుడు మర్చి పోనని ఎల్ల వేళల అండగా ఉంటానని తెలియ జేశారు,ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు దాసరి బాబు,జనసేన అధ్యక్షులు పందిటి మల్హోత్ర,ధనపాల జగన్,బియన్, శ్రీనివాసులు(సర్పంచ్),కటారి కృష్ణ,బిపి సుధా,ఆకుల కృష్ణయ్య,లక్ష్మీ నారాయణ,రాధ,ఖాధర్ భాషా,ధనపాల రవి,రాకేట్ రఫి తదితరులు పాల్గోన్నారు.

## పేరాలగుట్ట వేలం ద్వారా రూ.1.65 లక్షల ఆదాయం

గాలివీడు, మార్చి 27(ప్రభాతవార్త):
మండలంలోని గోరాన్‌చెరువు గ్రామ పంచాయతీ పేరాలగుట్ట సహజ వనరులు అయిన కట్టుడురాయి, గేటు వేలంపాట బుధవారం పూర్తయింది. రాయచోటి డివిజన్ డీఎల్‌పీఓ ఆదేశానుసారం ఈఓపీఆర్‌డీ శేఖర్‌నాయక్, సర్పంచ్ దీప్తి ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శి సరోజమ్మలు వేలంపాట నిర్వహించగా పేరాలగుట్ట అత్యధికంగా రూ.1.65 లక్షలు గ్రామంలోని గేటుకు చెందిన గుత్తేదారు దక్కించుకున్నాడు. గతేడాది కంటే ఈ సంవత్సరం అదనంగా రూ.50 వేలు పోవడం గ్రామ ప్రజలను ఆశ్చర్యపరిచింది. 1 ఏప్రిల్ 2024 నుంచి 30 మార్చి 2025 వరకు కొనసాగనుందని పంచాయతీ సెక్రటరీ సరోజమ్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యవర్గ సభ్యులు, సచివాలయ సిబ్బంది, వేలంపాట పోటీదారులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఇసుక రీచ్ లను పరిశీలించిన ఆర్డీఓ

వీరబల్లి, మార్చి27,ప్రభాతవార్త :
మండల కేంద్రంలో ఇసుక రీచ్‌లను ఏర్పాటు చేయాలనే ఉద్దేశ్యంతో బుధవారం రాజంపేట ఆర్డీఓ మోహన్ రావు మండలంలోని అనువైన ఇసుక రీచ్‌లకు స్థలాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమమంలో బాగంగా వీరబల్లి లోని గంగమ్మ గుడి సమీపంలోని మాండవ్యనది మరియు మట్లి పంచాయితీలోని కోదండరామస్వామి దేవాలయం వద్ద ఇసుక రీచ్‌లు ఏర్పాటు కు అనువైన స్థలాన్ని పరిశీలించారు. అనంతరం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో త్రాగునీటి ఎద్దడిపై సమీక్షా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఆర్డీఓ మాట్లాడుతూ గ్రామాలలో నీటి ఎద్దడి లేకుండా చూడాలన్నారు. వేసవి కాలం లో నీటి ఎద్దడికి గురయ్యే గ్రామాలను ముందుగానే గుర్తించి ఆ గ్రామాలకు ప్రత్యామ్నాయ పనులతో నీటి సమస్య తార్చాలని అధికారులను ఆదేశించారు. అలాగే రైతులకు, ప్రజలకు ఇబ్బందులు లేని చోట ఇసుక రీచ్‌లను ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమమంలో స్థానిక తాహశీల్దారు కె.వి శ్రీనివాసులు, ఎంపీడీఓ రామచంద్రారెడ్డి, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## ప్రొద్దుటూరులో టీడీపీ జెండా ఎగరేద్దాం

### - కలిసి కట్టుగా విజయం సాధిస్తాం.. వరదను గెలిపించుకుంటాం- సీఎం సురేష్ నాయుడు



ప్రొద్దుటూరు క్రైం, మార్చి 27, ప్రభాతవార్త: ప్రొద్దుటూరు నియోజకవర్గంలో తెదేపా తెదేపాలో పనిచేస్తున్న నాయకులు, కార్యకర్తలు కలిసి కట్టుగా వంద శాతం పని చేసి నంద్యాల వరదరాజుల రెడ్డిని గెలిపించి చంద్రబాబునాయుడుకు గిఫ్ట్‌గా పంపిస్తామని తెదేపా జెండా ఎగురవేస్తామని టీడీపీ రాష్ట్ర నాయకుడు సీఎం సురేష్ నాయుడు అన్నారు. పెద్దఎత్తున తెదేపా నాయకులు, కార్యకర్తల సమావేశం సురేష్‌నాయుడు ఆధ్వర్యంలో జరిగింది. ఈ సమావేశానికి పులివెందుల టీడీపీ అభ్యర్థి బీటెక్ రవీంద్రనాథ్‌రెడ్డి, వి.ఎస్.ముక్తియార్, ఎ.రామిరెడ్డి, సుధాకర్‌రెడ్డి, నల్లపోతుల నాగరాజు, విజయభాస్కర్‌రెడ్డి తదితరులు హాజరయ్యారు.ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో తెదేపా నాయకులు, కార్యకర్తలు, జనసేన నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మూల్యంకన విధుల కేటాయింపులోఅవకతవకలను సరి చేయాలి

### - ఆర్జేడీకి యూటీఎఫ్ పిర్యాదు



కడప వైద్యవిభాగం, మార్చి 27, ప్రభాతవార్త: ఏప్రిల్ 1వ తేదీ నుంచి జరగనున్న పదో తరగతి మూల్యాంకన విధుల కేటాయింపులో జరిగిన అవకతవకలను, తప్పులను సరి చేయాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేష్‌బాబులు డిమాండ్ చేశారు. బుధవారం సాయంత్రం కడపలోని పాఠశాల విద్య ప్రాంతీయ సంయుక్త సంచాలకుల కార్యాలయంలో సూపరింటెండెంట్ ఎం.బాబు నాయక్‌ను కలిసి పదో తరగతి మూల్యాంకన విధుల కేటాయింపులో జరిగిన అవకతవకలపై ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా ట్రెజరర్ నరసింహారావు, జిల్లా కార్యదర్శులు సీవీ రమణ, ఎజాస్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

## సరస్వతి పుత్రులు పుట్టపర్తి నారాయణాచార్యులు



కడప వైద్యవిభాగం, మార్చి 27, ప్రభాతవార్త: పుట్టపర్తి నారాయణాచార్యులు చిన్న వయసులోనే భారతం, భాగవతం, సంగీతం నేర్చుకున్నారని, ప్రముఖ సీనియర్ వైద్యులు డా.కె.గోపీనాథ్ అన్నారు. గురువారం పుట్టపర్తి 110వ జయంతి సందర్భంగా బుధవారం ఆర్కే రాయల్ కరీం సేవా సమితి ఆధ్వర్యంలో డా.గోపీనాథ్ వారి కార్యాలయం నందు పుట్టపర్తి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆర్కే సేవా సమితి అధ్యక్షులు రాయల్ అబ్దుల్ కరీముల్లా, కవులు, కళాకారులు, అభిమానులు పాల్గొన్నారు.

## వైసీపీ అధ్యక్ష పదవిని బీసీలకు ఇవ్వాలి- గుండ్లకుంట శ్రీరాములు



కడప వైద్యవిభాగం, మార్చి 27, ప్రభాతవార్త: యువజన శ్రామిక రైతు కాంగ్రెస్ ఎపార్టీ శాశ్వత అధ్యక్షుడిగా కొనసాగుతున్న వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తక్షణమే పార్టీ అధ్యక్ష పదవిని బీసీలకు ఇవ్వాలని బుధవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటుఉ చేసిన విలేకరుల సమావేశం లో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు గుండ్లకుంట శ్రీరాములు అన్నారు. ఇప్పటికైనా పార్టీ రాష్ట్ర అధ్యక్ష పదవిని బీసీలకు కేటాయించాలని శ్రీరాములు డిమాండ్ చేశారు. షర్మిల పర్యటన ఏప్రిల్1కి వాయిదాపీసీసీ అధ్యక్షురాలు శ్రీమతి వైఎస్.షర్మిలారెడ్డి కడప జిల్లా పర్యటన మార్చి 28 నుంచి ఏప్రిల్ 1కి అనివార్య కారణాల వల్ల వాయిదా పడిందని విలేకరుల సమావేశంలో శ్రీరాములు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిటీ కాంగ్రెస్ అధ్యక్షులు విష్ణుప్రీతంరెడ్డి, పీసీసీ డెలిగేట్ పొట్టిపాటి చంద్రశేఖర్‌రెడ్డి, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు మూలంరెడ్డి ధ్రువకుమార్‌రెడ్డి, పీసీసీ మైనార్టీ సెల్ ఉపాధ్యక్షులు పఠాన్ మహ్మద్ అలీఖాన్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మోపూరు వెంకటరమణారెడ్డి, వేమయ్య, రామకృష్ణ అలియాస్ బద్రీ పాల్గొన్నారు.

## మామిడి చెట్లు దగ్ధం

పెండ్లిమర్రి, మార్చి 27, ప్రభాతవార్త: పెండ్లిమర్రి మండలం తిప్పిరెడ్డిపల్లె గ్రామ నివాసి అయిన షేక్ బడెసాబ్ సుమారు 20 సంవత్సరాల నుంచి మామిడి చెట్లు సాగు చేస్తూ కుటుంబాన్ని పోసించు కుంటున్నారు. గంగనపల్లె గ్రామ పొలం సర్వే నంబరు 1004లో మంగళవారం తమ తోటలో గడ్డికి నిప్పు పెట్టగా సుమారు 100 చెట్లకు పైగా కాలిపోయాయని బాధితుడు వాపోయాడు. తమకు న్యాయం చేయాలని బాధితుడు తహసీల్దారుకు వినతిపత్రం సమర్పించి న్యాయం చేయాలని కోరుతున్నారు.

## కోటవారిపల్లెతాండాలో వైకాపా ఎన్నికల ప్రచారం



మదనపల్లె, మార్చి 27 ప్రభాతవార్త :
రూరల్ మండలంలోని కోటావారిపల్లె తాండాలో బుధవారం వైకాపా నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి నిస్సార్‌అహ్మద్ నాయకులు, కార్యకర్తలతో కలసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా తాండాలో జరిగిన జాతరలో పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన గ్రామంలో విస్తృతంగా ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఆయనతో పాటు ఎన్నికల ప్రచారంలో మాజీ ఎమ్మెల్సీ నరేష్‌కుమార్‌రెడ్డి, నియోజకవర్గ యువనాయకులు శశాంక్‌రెడ్డి పాల్గొని ప్రభుత్వం ఐదేళ్ళలో చేపట్టిన సంక్షేమ పథకాల గురించి కరపత్రాల ద్వారా ప్రజలకు వివరించారు. వచ్చే ఎన్నికల్లో వైకాపాను గెలిపించి మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డిని ఎన్నుకోవాలని అభ్యర్థించారు. వైకాపా మళ్లీ అధికారంలోకి వస్తేనే రాష్ట్రం అన్ని విధాల అభివృద్ధి చెందడమే కాకుండా సంక్షేమ పథకాలు యదావిధిగా కొనసాగుతాయన్నారు. ఈఎన్నికల ప్రచారానికి గ్రామ ప్రజలు మేళ తాళాలతో స్వాగతించారు.

## ప్రశాంతంగా ముగిసిన పదవ తరగతి పరీక్షలు

రామసముద్రం, మార్చి 27 ప్రభాతవార్త :
మండలంలో పదవ తరగతి పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ముగిశాయి. మూడు సెంటర్లలో విద్యార్థులు 568గానూ 528మంది హాజరు అయ్యారు. 40మంది గైర్హాజరు అయ్యారు.

## టిడిపి, వైసిపిలు మైనార్టీల ఓట్లు అడిగే హక్కులేదు

### కాంగ్రెస్ నియోజకవర్గ నాయకులు రెడ్డిసాహెబ్



మదనపల్లె, మార్చి 27 ప్రభాతవార్త :
కేంద్రంలోని బిజెపితో అంటకాగుతున్న టిడిపి, జనసేన, వైసిపిలకు ముస్లిం మైనార్టీల ఓట్లు అడిగే నైతిక హక్కు లేదని నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు రెడ్డిసాహెబ్ తెలిపారు. బుధవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో ముస్లింల హక్కులకు భంగం కలిగించే ఎన్ఆర్‌సి, సిఏఏ చట్టాలను బిజెపి ప్రభుత్వం తీసుకువస్తే అప్పట్లో టిడిపి అధినేత చంద్రబాబు వాటిని నల్ల చట్టాలుగా అభివర్ణించి సదరు చట్టాలను రద్దు చేయాలని నిరసన చేసిన విషయాన్ని గుర్తు చేశారు. బెంగుళూరు బస్టాండు ముస్లిం సోదరులు ఏర్పాటు చేసిన ఇఫ్తార్‌విందులో చంద్రబాబు పాల్గొని ప్రజాగళం బహిరంగసభలో పాల్గొనడం ముస్లిం మైనార్టీలను మభ్యపెట్టడానికే అని స్పష్టం చేశారు. స్వార్థ ప్రయోజనాల కోసం చంద్రబాబు ముస్లింలను పావులుగా వాడుకొంటున్నారన్నారు. ఎన్‌డిఏ కూటమికి మద్దతు పలకడం పెద్ద తప్పిదమన్నారు. వైఎస్.రాజశేఖర్‌రెడ్డి ముస్లింలకు ఎంతో మేలు చేశారని అయితే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ముస్లింల మనోభావాలను దెబ్బతీసే విధంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. వీరికి ముస్లింల ఓట్లు అడిగే నైతిక హక్కు లేదన్నారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి మైనార్టీలకు మేలు జరగాలంటూ రాహుల్‌గాంధీ ప్రధాని కావాలన్నారు. ఈకార్యక్రమంలో నాయకులు డాక్టర్ ఎస్‌కె.బాషా, సురేంద్రరెడ్డి, అయేషా, ఈశ్వరమ్మ, చలపతి, మహబూబ్‌బాషా, మస్తాన్, తదితరులు పాల్గొన్నారు.

## విజయవంతంగా ముగిసిన ఉచిత నేత్ర వైద్యశిబిరం



కమలాపురం, మార్చి 27, ప్రభాతవార్త: కమలాపురం నగర పంచాయతీ పరిధిలోని ఉన్న స్వామి వివేకానంద ఇ.ఎం. స్కూలులో బ్యాక్వర్డ్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సొసైటీ (బీసీడీఎస్), మదర్ థెరిసా సేవా సమితి చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో అభిలాష్ నేత్ర వైద్యశాల వైద్యులతో ఉచిత నేత్ర వైద్యశిబిరం ఏర్పాటు చేయడం జరిగింది. ముఖ్య అతిథులుగా అభిలాష్ నేత్ర వైద్యశాల వైద్యులు డా.ఎస్.గురు అభిలాష్ ఎంబీబీఎస్, డీవో స్వామి వివేకానంద ఇ.ఎం స్కూలు కరస్పాండెంట్ రామ సుబ్బారెడ్డి, బ్యాక్వర్డ్ కమ్యూనిటీ డెవలప్‌మెట్ సొసైటీ ఛైర్మన్ యాగప్ప ట్రస్ట్ ఛైర్మన్ జూటూరు విజయ్‌కుమార్ పాల్గొన్నారు. అనంతరం గురు అభిలాష్ మాట్లాడుతూ కంటికి సంబంధించిన వ్యాధులు రాకుండా ఉండటానికి మంచి పోషక పదార్థాలు కలిగిన ఆకు కూరలు, పండ్లు, చేపలు తీసుకోవాలన్నారు. అలాగే బ్యాక్వర్డ్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సొసైటీ ఛైర్మన్ యాగప్ప మాట్లాడుతూ ఈ వైద్యశిబిరంలో 200 మంది కంటి సంబంధించిన పరీక్షలు చేయించుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మేరీ, శ్రీనివాసులు, శ్రీకాంత్, నాగజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## సిద్ధం సభకు తరలిన వైకాపా నాయకులు



దువ్వూరు, మార్చి 27, ప్రభాతవార్త: మండలంలోని ప్రతి గ్రామ పంచాయతీ నుండి ప్రొద్దుటూరులో వైకాపా పార్టీ చేపట్టిన మనమంతా సిద్ధం సభకు ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. గుడిపాడు గ్రామం నుండి ఎంపీటీసీ
గోపిరెడ్డి శ్రీనివాసులరెడ్డి, సర్పంచ్ మహబుబ్ బాషా, తుమ్మల మస్తాన్ రెడ్డి, గోపిరెడ్డి గురివిరెడ్డి తదితరులు భారీ సంఖ్యలో తరలివెళ్లారు. అలాగే మూడిళ్లపల్లె సర్పంచ్ రాజగోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో బస్సుల్లో పార్టీకార్యకర్తలను తరలించారు. ముఖ్యమంత్రి ఎన్నికల ప్రచారంలో భాగంగా జిల్లా పర్యటనలో భాగంగా దగ్గరలో ఉన్న ప్రొద్దుటూరుకు రావడంతో వైకాపా నాయకులు బాణాసంచా పేలుస్తూ ప్రొద్దుటూరు సభకు తరిలారు.తరలివెళ్లిన వారిలో ఎంపీపీ కానాల జయచంద్రారెడ్డి, జడ్పీటీసీ ఏరువ కృష్ణయ్య, మండల కన్వీనర్ చిరాకి బాష తదితరులు ఉన్నారు.

## మీ భవిష్యత్తు-మీ ఓటుపై అవగాహన



దువ్వూరు, మార్చి 27, ప్రభాతవార్త: మండల పరిధిలోని ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద మీ భవిష్యత్తు మీ ఓటు అనే కార్యక్రమంపై ఎన్నికల అధికారులు అవగాహన కల్పించారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద ఓటు హక్కును సక్రమంగా వినియోగించుకోవాలని మీ ఓటు మీ భవిష్యత్తును నిర్ణయిస్తుందని, అందువల్ల ప్రజాస్వామ్య పద్ధతిలో ఎమ్మెల్యే, ఎంపీలను ఎంచుకోవాలని ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద ముగ్గులతో చిత్రపటాలు వేశారు. వీటిని తహసీల్దార్‌ఉమారాణి, ఎంపీడీఓ సుగుణ శ్రీ, ఎన్నికల అధికారులు పరిశీలించారు. 2024ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని, అందులో భాగంగానే ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. అలాగేముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎన్నికల ప్రచారంలో భాగంగా దువ్వూరు మీద వెలుతుండగా ఎన్నికల ప్రవర్ధన నియమావళి సక్రమంగా అమలు చేసేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. ఎక్కడికక్కడ వాహణాలతనిఖీ తదితర కార్యక్రమాలు చేపట్టామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల వీఆర్‌ఓలు,సిబ్బంది పాల్గొన్నారు.

## ట్రాన్స్‌ఫార్మర్‌కు వెంటనే మరమ్మత్తులు చేపట్టండి..



ఖాజీపేట, మార్చి 27, ప్రభాతవార్త: ఖాజీపేట మండలం కూనవారిపల్లె పంచాయతీలోని పిచ్చపాటిపల్లి గ్రామంలో మంగళవారం విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ కాలిపోయింది. గ్రామ సమీపంలో త్రాగునీటి మెటారు కోసం ఏర్పాటుచేసిన ట్రాన్స్ ఫార్మర్ కాలిపోవడంతో గ్రామంలో నీటి ఎద్దడి నెలకొంది. ట్రాన్స్ ఫార్మర్ కాలిపోయిన విశయంపై విద్యుత్ శాఖ ఇన్చార్జి ఏఈగోవర్ధన్ రెడ్డికి గ్రామస్థులు మొరపెట్టుకున్న ఫలితం లేదని గ్రామస్థులు అంటున్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మత్తులు చేయించి త్రాగునీటి సమస్యలను పరిష్కరించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

## కాంగ్రేస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీరాములును

### కలిసిన జిల్లా ఎస్సీ సెల్ ఛైర్మెన్ వెంకటరమణ



ఖాజీపేట, మార్చి 27, ప్రభాతవార్తం కాంగ్రేస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీరాములును జిల్లా ఎస్సీ సెల్ ఛైర్మెన్ గున్నంపాటి వెంకటరమణ కడప జిల్లా కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఆయనకు బొకేఅందించి సన్మానించడం జరిగింది. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న సంధర్భంగా మైదుకూరు నియోజకవర్గంలో కాంగ్రేస్ పార్టీని ముందుకు తీసుకువెల్లే సంధర్భంలో శ్రీరాములును కలవడం జరిగిందన్నారు. కాంగ్రేస్‌పార్టీకి జిల్లాలో పూర్వ వైభవం తెచ్చే దిశగా అడుగులు వేయాలని జిల్లా అధ్యక్షుడు శ్రీరాములు సూచించారు.

## విద్యుత్‌శాఖ ఈఈని కలిసిన అసోసియేట్ నాయకులు

మదనపల్లె, మార్చి 27 ప్రభాతవార్త :



మదనపల్లె విద్యుత్‌శాఖ ఇన్‌చార్జ్ ఈఈ శ్రీనివాస మూర్తిని ఓసి అసోసియేషన్ నాయకులు బుధవారం కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా డివిజన్ కార్యదర్శి శేషాద్రినాగరాజు, సర్కిల్‌నాయకులురఘు, జె.శ్రీనివాసులు, శివమూర్తిలు ఈఈతోకార్మికులసమస్యలపైవిన్నవించారు. విద్యుత శాఖ సంస్థ అభివృద్ధికి తమ అసోసియేషన్ ఎప్పుడూ ముందు ఉంటుందన్నార. కార్మికుల సమస్యల పరిష్కా రానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో నాయకులు సాయిప్రతాప్, రాజు, వేమారెడ్డి, గోపాల్‌రెడ్డి, ఆనందరెడ్డి, యుగంధర్, కలాంభాషా, జగదీష్‌రెడ్డి, యాకూబ్, అస్లాంసాహెబ్, జనార్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## చంద్రబాబు బహిరంగసభకు భారీగా తరలిన ప్రజలు

### టిడిపి, జనసేన నాయకులు భారీ బైక్‌ర్యాలీ



మదనపల్లె, మార్చి 27 ప్రభాతవార్త :
తెలుగుదేశం పార్టీ జాతీయ నాయకులు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు బుధవారం పట్టణంలోని బెంగుళూరు బస్టాండులో చేపట్టిన ప్రజాగళం బహిరంగసభకు నియోజకవర్గంలోని ప్రజలు భారీ ఎత్తున తరలివచ్చారు. టిడిపి, జనసేన పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఉమ్మడి చిత్తూరుజిల్లాలోని పుత్తూరు నుంచి హెలిక్యాప్టర్ ద్వారా మదనపల్లెకు చంద్రబాబు విచ్చేశారు. హెలిప్యాడ్ నుంచి బస్సుయాత్రచే ప్రజాగళం సభకు విచ్చేశారు. సాయంత్రం 6గంటలకు బెంగుళూరు బస్టాండు జనమయంతో నిండిపోయింది. ముస్లిం సోదరులు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో చంద్రబాబు పాల్గొన్నారు. అనంతరం ప్రజాగళం బహిరంగసభలో ప్రసంగించారు. చంద్రబాబునాయుడు ప్రసంగం ప్రజలను ఆకట్టుకొంది. నియోజకవర్గ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న షాజహాన్‌బాషాను గెలిపించాలని ఆయన ప్రజలను కోరారు. ఎమ్మెల్యే అభ్యర్థి షాజహాన్‌బాషా ప్రజాగళం బహిరంగసభను విజయవంతం చేసి తన సత్తాను చాటుకొన్నారు. రాష్ట్ర తెలుగుయువత అధ్యక్షులు శ్రీరామ్‌చినబాబు, సీనియర్ నాయకులు మార్పూరి సుధాకర్‌నాయుడు, జనసేన నియోజకవర్గ నాయకులు శ్రీరామ రామాంజనేయులు, రాజంపేట పార్లమెంటరీ నేత ఆర్‌జె.వెంకటేష్, టౌన్‌బ్యాంకు మాజీ ఛైర్మెర్ నాదేళ్ళ విద్యాసాగర్, మాజీ కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, మాజీ ఎంపిటిసిలు, జడ్పిటిసిలు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొనడం జరిగింది.

## పదవతరగతి పరీక్షలకు వెళ్లుతూ విషాదాం

### రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి మరోఇద్దరికి గాయాలు



మదనపల్లెక్రైం, మార్చి 27 ప్రభాతవార్త :
పదవ తరగతి పరీక్షలకు వెళ్లుతున్న విద్యార్థి సాయిచరణ్ (16) రోడ్డుప్రమాదంలో మృతి చెందిన విషాదకర సంఘటన బుధవారం పిటిఎం మండలంలో జరిగింది. పరీక్ష చివరి రోజు కావటంతో సాయిచరణ్, మరో విద్యార్థి వెంకటేష్‌లు ద్విచక్రవాహనంలో పరీక్షా కేంద్రంకు వెళ్లతుండగా, మరోక ద్విచక్రవాహనం ఢీకొంది. ప్రమాదంలో సాయిచరణ్ మృతి చెందగా, మరో విద్యార్థి వెంకటేష్, ఎదురు వాహనంలో వున్న శ్యామ్ (32), నరసింహులు (33)లు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా వున్నాయి. బి.కొత్తకోటకు చెందిన హెడ్‌కానిస్టేబుల్ వెంకటరమణ కుమారుడు సాయిచరణ్ పదవతరగతి చదువుతున్నాడు. సాయిచరణ్, స్నేహితుడు వెంకటేష్‌తో కలిసి బయలుదేరారు. అయితే వెంకటేష్ తండ్రి పిటిఎం మండలం కాట్నగల్లులో వుండటంతో ఉదయం ద్విచక్రవాహనంలో కాట్నగల్లుకు వెళ్లారు. అనంతరం తిగిరి వస్తుండగా పిటిఎం మండలం కుమ్మరపల్లి వద్ద ఎదురుగా వస్తున్న మరో వాహనం ఢీకొంది ఈ ప్రమాదంలో సాయిచరణ్, వెంకటేష్, కాట్నగల్లుకు చెందిన శ్యామ్, నరసింహులులు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని 108వాహనంలో మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించగా, చికిత్సలు పొందుతూ సాయిచరణ్ మృతి చెందాడు. గాయపడిన వారికి చికిత్సలు చేయిస్తున్నారు. పిటిఎం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## వైసిపిపై గెలవలేకనే ఫ్లెక్సీలు చించివేత

### ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి



ప్రొద్దుటూరు, మార్చి 27, ప్రభాతవార్త: ఫ్లెక్సీలు చించడం అమానుషమని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి అన్నారు. బుధవారం ఆయన ప్రొద్దుటూరులో ఏర్పాటు చేసిన పలు ఫ్లెక్సీలుచింపినసంధర్భంగా మాట్లాడు తూటిడిపి వారు తమ సభకు అడ్డుపడాలనే దురుద్దేశంతోనే ఇలాచేశారని,టిడిపిఎమ్మెల్యే అభ్యర్థి వరదరాజుల రెడ్డికి ఈ సంఘటన తెలిసి జరిగిందో, లేదో తమకు తెలియదని కేవలం సీఎం ప్రోగ్రామ్‌పై బాధ తోనే ఇటువంటిచర్యలు చేశారని విమర్శించారు. మరోవైపు వరదరాజుల రెడ్డి, ఆయన కుటుంబసభ్యులు తమ నాయకులు, కార్యకర్తలనుబెదిరిస్తూఏజెంట్లుగాకూర్చోరాదనితెలపడం సరికాదన్నారు .ఎన్నికలుప్రజాస్వామ్యబద్ధంగాజరపాలనికోరారు.ఈ కార్యక్రమం లో ఎంపీపీ శేఖర్ యాదవ్, కౌన్సిలర్ వరికూటి ఓబుల్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

## పుత్తూరు కట్టు శల్య వైద్యులు సుబ్బారెడ్డి టీడీపీలో చేరిక

కమలాపురం, ప్రభాతవార్త:



కమలాపురం పట్టణంలో అనేక సంవత్సరాలుగా పుత్తూరు కట్టు కడుతున్న గంగవరం గ్రామానికి చెందిన పుత్తూరు శల్యవైద్యులుపాలగిరిసుబ్బారెడ్డి బుధవారం టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి సమక్షంలో తెదేపాలో చేరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రంజాన్ తోఫా అందజేయడం పూర్వజన్మ సుకృతం

### - ఎర్రపురెడ్డి శరత్‌గిరి రెడ్డి

సుండుపల్లె, మార్చి 27, ప్రభాతవార్త:
గ్రామ ప్రజలకు రంజాన్ తోఫా అందజేయడం తనకు ఆ భగవం తుడు ప్రసాదించిన వరమని తన తల్లి సుండుపల్లె మండల మాజీ సర్పంచ్ ఎర్రపురెడ్డి నిర్మలమ్మ జ్ఞాపకార్థం రంజాన్ తోఫాను అందజేస్తున్నామని మండల వైఎస్ఆర్ కాంగ్రెస్ నాయకులు ఎర్రపురెడ్డి శరత్ గిరిరెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని ఆయన స్వగృహంలో గ్రామ ముస్లిం ఆడపడుచులకు రంజాన్ తోఫాను అందజేశారు. వైసీపీ జేసీఎస్ కన్వీనర్ రెహమాన్‌ఖాన్ మాట్లాడుతూ రంజాన్ సందర్భంగాముస్లింసోదరులకుప్రత్యేకంగా తోఫాను అందజేసిన శరత్‌గిరిరెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో 500 మందికి పైగా రంజాన్ తోఫాను పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సుండుపల్లె గ్రామం ముస్లిం మైనార్టీలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## 12వ డివిజన్‌లో బాబూష్యూరిటీ

## -భవిష్యత్తుకు గ్యారెంటీ

కడప వైద్యవిభాగం, మార్చి 14, ప్రభాతవార్త: కడప నగరంలోని 12వ డివిజన్ గురుకుల్ విద్యాపీఠ్ నుంచి కడప నియోజకవర్గ టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి రెడ్డప్పగారి మాధవిరెడ్డి ఎన్నికల ప్రచారంలో భాగంగా బాబూ ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చంద్రబాబునాయుడు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాల గురించి వివరించారు. వచ్చే ఎన్నికల్లో తెదేపాను గెలిపించాలని కోరారు. డివిజన్‌లోని పలువురు తెదేపాలో చేరడంతో వారికి కండువాలు వేసి ఆమె ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కేజే సిస్టమ్స్ అండ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌కు

### రాణి తిరుమల దేవి డిగ్రీ కళాశాల విద్యార్థినిలు ఎంపిక



ప్రొద్దుటూరు అర్బన్, మార్చి 27, ప్రభాతవార్త: స్థానిక రాణి తిరుమల దేవి డిగ్రీ కళాశాల తృతీయ సంవత్సరం బీఎస్సీ ఎంఎస్సీఎస్ కంప్యూటర్ సైన్స్ చదువుతున్న విద్యార్థినిలు మార్చి 6న జరిగిన కేజే సిస్టమ్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ వారు నిర్వహించిన ఆన్‌లైన్ అసెస్మెంట్ టెక్నికల్ రౌండ్ అండ్ హెచ్‌ఆర్‌లో విశేష ప్రతిభ కనబరిచి సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలకు ఎంపికయ్యారని, వారికి వార్షిక వేతనం క్రింద 5లక్షలు ఇవ్వడం జరుగుతుందనికళాశాల ప్రిన్సిపల్ టి.చంద్రశేఖర్ రెడ్డి, కరస్పాండెంట్ ఎల్.తరుణ్ ఇంద్ర శేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్, కరస్పాండెంట్, డైరెక్టర్ సుబ్బరాయుడు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఇన్చార్జీ ప్రిన్సిపల్ ఎస్.వెంకటేశ్వరరెడ్డి, కోఆర్డినేటర్ రవి తరుణ్ మరియు కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర బృందం వీరిని అభినందించారు.

## ప్రభుత్వ పాలిటెక్నిక్ మెకానికల్

## ఇంజనీరింగ్ బ్రాంచ్‌కు ఎన్.బి.ఏ గుర్తింపు




ప్రొద్దుటూరు అర్బన్, మార్చి 27, ప్రభాతవార్త: ప్రొద్దుటూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల మెకానికల్ ఇంజనీరింగ్ బ్రాంచ్‌కు ఎన్.బి.ఏ (నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడిటేషన్) గుర్తింపు లభించింది. దీనివల్ల 2014-25 విద్యాసంవత్సరం నుండి మూడు సంవత్సరాలు కళాశాల మెకానికల్ ఇంజనీరింగ్ బ్రాంచ్ మౌళిక సదుపాయాల కోసం కేంద్ర ప్రభుత్వ నిధులు, రాయితీలు లభిస్తాయి. అలాగే రాష్ట్ర స్థాయిలో గుర్తింపు ఉంటుంది. ఇక్కడ చదివినమెకానికల్ ఇంజనీరింగ్ విద్యార్థులకు క్యాంపస్ ఎంపికలలో కూడ ప్రాధాన్యత ఉంటుంది. మూడేళ్ల తర్వాత ఎన్.బి.ఏ ప్రమాణాలకు అనుగుణంగా ఉంటే మళ్లీ గుర్తింపు కొనసాగుతుంది. ప్రొద్దుటూరు మెకానికల్ ఇంజనీరింగ్ బ్రాంచకు ఎన్.బి.ఏ గుర్తింపు వచ్చిన సంధర్భంగా సిఎస్‌ఈ, ఈసీఈ, ట్రిబుల్ ఈ విభాగం సిబ్బంది ఆనందంవ్యక్తం చేసి మెకానికల్ ఇంజనీరింగ్ బ్రాంచ్ విభాగ సిబ్బందికి, ప్రిన్సిపల్ జగదీశ్వరుడుకు అభినందనలు తెలిపారు.

## దొంగలించిన బంగారాన్ని రికవరి చేసిన సీఐ



ముద్దనూరు, మార్చి 27, ప్రభాతవార్త: ముద్దనూర్ టౌన్‌కు చెందిన పాలగిరి విశ్వనాథ ఆచారి ఇంట్లో దొంగలించిన బంగారాన్ని రికవరీ చేసినట్లు సీఐ దస్తగిరి పేర్కొన్నారు. బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సీఐ విలేకరులసమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సంధర్భంగా సీఐ మాట్లాడుతూ నిందితులైన ధర్మవరంకు చెందిన సమ్మె రామాంజినేయులు, కదిరికి చెందిన యనమల ఆంజనేయులు వద్ద నుండి సుమారు 18.5తులాల బంగారంను రికవరీ చేశామని,అనంతరం వారికి కోర్టుకు తరలించినట్లు సీఐ దస్తగిరి తెలిపారు.

## చంద్రబాబు సభకు

## తరలిన మండల నాయకులు

రామసముద్రం, మార్చి 27 ప్రభాతవార్త :
మాజీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు మదనపల్లెలోని బెంగుళూరు బస్టాండులో బుధవారం ప్రజాగళం బహిరంగసభ నిర్వహిస్తున్నార. ఈసభకు మండల పార్టీ అధ్యక్షులు విజయగౌడు ఆధ్వర్యంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పలు వాహనాల్లో ఈ సభకు తరలివెళ్లారు. ఈ సభకు తరలిన వారిలో ప్రదీప్‌గౌడు, అన్సర్‌బాషా, శివశంకర్, చాను, రాజేష్‌స్వామి, రెడ్డిశేఖర్, కిట్టరెడ్డి, వేణు, చిన్నా స్వామి, బద్రినాథ్, ఒంటెల అల్తాఫ్‌బాషా, చాంద్ బాషా, రమేష్, నారాయణరెడ్డి, శివారెడ్డి, మంజు, రెడ్డప్ప, జయకుమార్, జనార్ధన్, చెంగారెడ్డి, జువెద్, బాలాజి అధికసంఖ్యలో కార్యకర్తలు బయలుదేరివెళ్ళారు.



